సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 27 । మే । 2025



సత్వర చర్యలు 8లో

పారిశ్రామికాభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కొత్త పరిశ్రమల స్థాపనపై సమీక్షించారు.



సింహాచలం ఈవోగా విధుల్లో చేరిన త్రినాథరావు 8లో



విమ్స్‌లో 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ 8లో

న్యూస్‌రీల్

1 నుంచి చౌకధరల దుకాణాల్లోనే సరకుల పంపిణీ



డీఎస్‌వో మూర్తి

తుమ్మపాల: ప్రభుత్వం అందించే నిత్యావసర సరకులను వచ్చే నెల 1 నుంచి చౌక ధరల దుకాణాల (రేషన్ డిపోల) ద్వారానే పంపిణీ చేయనున్నట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌వో) కె.వి.ఎల్.ఎస్.మూర్తి అన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులు పంపిణీ చేసే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లాలో 1,069 చౌక ధరల దుకాణాల ద్వారా సరకుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ లోపల కుటుంబంలోని ఎవరైనా వెళ్లి సరకులు పొందవచ్చన్నారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని, ఆ సమయంలో లబ్ధిదారులు సరకులు తీసుకోవాలన్నారు. 65 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులకు 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల సమయంలో వారి ఇంటి వద్దకే సరకులు అందజేస్తామన్నారు. లబ్ధిదారులు రాష్ట్రంలో ఏ చౌకధరల దుకాణం నుంచైనా వారి సరకులు పొందవచ్చునన్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు వంటి ఏడు అంశాలకు సంబంధించిన సేవల కోసం ఇప్పటివరకు 21 వేల దరఖాస్తులు అందాయని చెప్పారు.

పోస్టాఫీసుల్లో ఆధార్ సీడింగ్

అనకాపల్లి: తపాలాశాఖ అనకాపల్లి డివిజన్ పరిధిలో ఆధార్ సీడింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎన్‌పీసీఐ లింకింగ్ లేని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారులకు ఆధార్ సీడింగ్ ద్వారా కొత్త అకౌంట్లు తెరుస్తామని డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి సులువుగా జమ అయ్యేందుకు దగ్గరలో ఉన్న తపాలాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

ఇక తిరగలేను.. ప్రాణం తీసుకుంటాను..



ముగ్గురు ఆడపిల్లలతో ఉన్న తనకు రెవెన్యూ అధికారులు తీవ్ర అన్యాయం చేశారని, కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని, తనకు చావే శరణ్యమంటూ కలెక్టరేట్ వద్ద మాకవరపాలెం మండలం పైడిపాలెం గ్రామానికి చెందిన జువ్వాది తాతారావు కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆయన తన ముగ్గురు ఆడబిడ్డలతో కలెక్టరేట్ వద్దకు పురుగుల మందుతో వచ్చారు. 'నాకు, మా అమ్మకు కలిపి గ్రామంలో 82.5 ఎకరాల భూమి ఉంది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో 4 సెంట్లు తొలగించేశారు. వీఆర్వో, ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌కు కూడా తిరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. తొలగించిన భూమిని రీసర్వేలో తిరిగి నమోదు చేస్తామని జిల్లా సర్వేయర్ సైతం చెప్పి చేతులు దులుపుకున్నారు. కూలి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే నేను ఇక తిరగలేను. ఇక్కడే చావాలని నిర్ణయించుకున్నాను. నాతోపాటు పురుగు మందు తెస్తే పోలీసులు తనిఖీలు చేసి సంచిలో ఉన్న బాటిల్ లాక్కున్నారు' అని చెప్పాడు. తన బిడ్డలను చూసైనా అధికారులు చలించాలని, సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరాడు.

బతికున్నాను మహాప్రభో..



మరణించిన తన అన్న పేరుతోపాటు తన పేరునూ రేషన్ కార్డు నుంచి తొలగించారని, ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగలేదని రాంబిల్లి మండలం అప్పన్నపాలెం గ్రామానికి చెందిన శింగంపల్లి మనోజ్‌కుమార్ పీజీఆర్ఎస్‌లో అర్జీ చేశారు. ఇప్పటికి చాలాసార్లు వినతి పత్రాలు ఇచ్చానని, ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించడంతో అలా కూడా ప్రయత్నించానని, రేషన్ కార్డు డేటాలో తన పేరు వద్ద చనిపోయినట్టు ఉందని చెప్పారు. రేషన్ కార్డు లేకపోవడంతో ఎటువంటి ప్రభుత్వ పథకాలు అమలు కావడం లేదని, తన సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నాడు.

అంతా భ్రాంతియేనా... అర్జీల గతి ఇంతేనా...!



- వినతులు సమర్పించినా కొలిక్కి కాని సమస్యలు
- ఎక్కడ గొంగళి అక్కడే ఉన్నా పరిష్కరించినట్టు మెసేజ్‌లు
- అర్జీదారులతో కూటమి ప్రభుత్వం ఆటలు
- పీజీఆర్ఎస్ అంతా డిజిటల్ మాయ అంటూ బాధితుల గగ్గోలు
- పదే పదే తిరగాల్సి వస్తోందని ప్రజల ఆవేదన

పీజీఆర్ఎస్: 'పరిష్కారం' అనే భ్రమ

కలెక్టరేట్ మెట్లు : సమస్యల 'తిరుగు ప్రయాణం' మొదలయ్యే చోటు

అర్జీ..: 'క్లోజ్డ్' అని కనిపించినా, సమస్య మాత్రం 'ఓపెన్'లోనే..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అద్భుతాలు ఇవి.. ప్రతి సోమవారం కలెక్టరేట్ మెట్లు ఎక్కే భాగ్యం సామాన్య ప్రజలకు కల్పిస్తూ, వారి సమస్యలకు 'శాశ్వత పరిష్కారం' చూపే అద్భుతమైన వేదిక ఇది. వినతులు ఇచ్చి, అవి పరిష్కారం కాకుండానే 'పరిష్కారమైపోయినట్లు' రికార్డుల్లో చూసి, కంగుతిని మళ్లీ మళ్లీ కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేసే అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి హాట్సాఫ్!. పీజీఆర్ఎస్ ఓ అంతులేని ప్రహసనం.. ప్రతి సోమవారం కలెక్టరేట్ గేటు దగ్గర కోలాహలం. పీజీఆర్ఎస్‌కు వచ్చామంటే సమస్య తీరినట్లే అనే భరోసా. కానీ లోపల జరిగే తతంగం మాత్రం వేరు. ఫిర్యాదు ఇచ్చామా, అది ఓపెన్ అయ్యిందా, అధికారులు చూశారా అనే కన్నా, 'పరిష్కారమైపోయింది' అని స్టేటస్ మారడం ముఖ్యమని అధికార యంత్రాంగం భావిస్తోంది. సమస్య అలాగే ఉన్నా, కాగితాలపై మాత్రం 'క్లోజ్' ! ఇది కదా అసలైన 'డిజిటల్ ఇండియా' అంటే!..'గత సోమవారం ఇదే సమస్య ఇచ్చానండి, పరిష్కారం కాలేదు. మళ్లీ వచ్చాను' అని చెప్పే నిస్సహాయుల మాటలు కలెక్టరేట్ గోడలు కూడా వింటున్నాయి. అయినా అధికారులకు మాత్రం వినిపించవు. ఎందుకంటే, వారికి కనిపించేది స్క్రీన్ మీద 'క్లోజ్డ్' అని మాత్రమే. సమస్య తీరకపోయినా, అది తీరినట్లు నమోదు చేయడం అనేది ఒక వినూత్నమైన ఆవిష్కరణ. దీని వల్ల ప్రజల ఆత్మస్థైర్యం పెరుగుతుందేమో ! మళ్లీ మళ్లీ పోరాడాలనే స్ఫూర్తి వస్తుందేమో!.. ఏదేమైనా, పీజీఆర్ఎస్ అనేది ఒక నిరంతరాయంగా కొనసాగే ప్రహసనం. ప్రజల ఓర్పుకు, అధికారుల 'సామర్థ్యానికి' అద్దం పడుతోంది. మళ్లీ వచ్చే సోమవారం కొత్త ఆశలతో, పాత సమస్యలతో ఎంతమంది కలెక్టరేట్ మెట్లెక్కుతారో చూడాలి.

– తుమ్మపాల



అర్జీదారు సమస్య ఆలకిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పీజీఆర్ఎస్‌కు 306 వినతులు

అర్జీదారుల ఆవేదన.. నిరసనకారుల ఆందోళనల మధ్య కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. కలెక్టర్ విజయ కృష్ణన్ జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 306 అర్జీలు అందాయి. కలెక్టరేట్‌కు వచ్చి పదే పదే సమస్య చెప్పుకుంటున్నా ఫలితం ఉండడం లేదని జనం వాపోతున్నారు. పేరుకే పీజీఆర్ఎస్ అని, స్పందన ఏమాత్రం లేదని చెబుతున్నారు. సోమవారం జిల్లా అధికారులను కలిసి గోడు వెళ్లబోసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్న భరోసా గత ప్రభుత్వంలో ఉండేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ధీమా రానురాను సన్నగిల్లుతోందని పలువురు చెప్పారు.

- డొంకాడ దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని పలు దళిత సంఘాలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపాయి. దోషులను కాపాడేలా పోలీసులు బెయిలబుల్ సెక్షన్లు వేశారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు.
- స్పీకర్ అయ్యన్నపాత్రుడి మైనింగ్ అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పర్యావరణ అనుమతులు లేవని ట్రిబ్యునల్ పనులను నిలిపివేసిందని, ఇప్పుడు అదే స్థలంలో మైనింగ్ కార్యకలాపాలుప్రారంభమయ్యాయన్నారు.
- నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో నిర్వాసిత కుటుంబాల్లో వివాహితులకు, మేజర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని నిర్వాసితులు కలెక్టర్‌ను కోరారు.

పూర్తి వివరాలు – 8లో

మరణంలోనూ వీడని స్నేహబంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- పెదపాడు గ్రామంలో అలముకున్న విషాదం



రాయి గణేష్ (ఫైల్)



జనపరెడ్డి సంజీవ్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్: వారిద్దరూ మిత్రులు. ఒకే ఊరిలో నివాసం. ఒకే ఊరిలో ఉద్యోగం. ఎప్పుడూ కలిసే ఉంటారు. కలిసి మెలిసి తిరుగుతారు. అందుకే కాబోలు.. మృత్యువులోనూ వారిది వీడని బంధమే. పెదపాడు గ్రామానికి చెందిన రాయి గణేష్ (25), జనపరెడ్డి సంజీవ్ (21) సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. వీరు తిమ్మరాజుపేట నుంచి పెదపాడు స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు అచ్యుతాపురంలో వేర్వేరు ప్రైవేట్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవారని స్థానికులు చెప్పారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో వారి కుటుంబాలతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతుడు జనపరెడ్డి సంజీవ్ అక్క 5 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడగా, తండ్రి పాము కాటుకు గురవ్వడంతో ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితమయ్యాడు. ఇక మృతుని తల్లి స్థానికంగా దినసరి కూలి పని చేసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్న సమయంలో అందివచ్చిన కొడుకు అనంతలోకాలకు చేరుకోవడంతో ఆ కుటుంబం ఆవేదన వర్ణనాతీతంగా ఉంది.

మానసిక చికిత్స కేంద్రం సందర్శన

మహారాణిపేట (విశాఖ): చిన్న వాల్తేరులోని ప్రభుత్వ మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. రోగుల మానసిక స్థితి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, లీగల్ వలంటీర్ కె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కలసికట్టుగా కూటమిని కూల్చాలి..



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, వేదికపై పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు

- ప్రజా క్షేమానికి అలుపెరుగని పోరాటం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి
- పార్టీ మాడుగుల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

దేవరాపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన పార్టీ మాడుగుల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం తారువ వైఎస్సార్ ఆడిటోరియంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శోభా హైమావతి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి నెలా ఒక పథకం అందేదని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా పథకాలు అమలు కాక ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగనన్న చేసిన మంచిని ప్రజలకు వివరించడంతోపాటు కూటమి పాలనలో అవినీతి, అక్రమాలను నిలదీసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ నెలాఖరులోగా మండల కమిటీలను, జూలై నెలాఖరుకు గ్రామ కమిటీలు, సెప్టెంబర్ నెలాఖరుకు బూత్ కమిటీల నియామకాలను ఏకాభిప్రాయంతో పూర్తిచేయాలన్నారు. విజయవాడలో త్వరలో భారీ ప్లీనరీ నిర్వహించే ఆలోచన చేస్తున్నారన్నారు. పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డుతో పాటు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సేనాపతి కొండలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరదపురెడ్డి లలితానాయుడు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు సోలం రమేష్, జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు కె.వి.రమణ, ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, రెడ్డి జగన్‌మోహన్, తాళ్లపురెడ్డి రాజారామ్, కురచా జయమ్మ, జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముడు రమణమ్మ, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలంనాయుడు, పొలిమేర విజయలక్ష్మి, కొత్తపల్లి శ్రీనివాస్, రొంగలి సూర్యనారాయణ, ధర్మిశెట్టి స్వాతి, కిముడు చినమ్మలు, పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, గొల్లవిల్లి రాజుబాబు, నాలుగు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలన కుటిల రాజకీయాలకే పరిమితం



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జగన్ పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించగా, కూటమి పాలనలో పచ్చ పార్టీకి చెందిన వారికి మాత్రమే వర్తింపచేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం చేయడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలపై పోరాటంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎదురొడ్డి నిలబడే ధైర్యాన్ని తమ నాయకుడు ఇచ్చారన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికలలో మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకొని మరోసారి సత్తా చాటగలిగామన్నారు. రాష్ట్రంలోనే క్రమశిక్షణకు మారుపేరుగా మాడుగుల నియోజకవర్గాన్ని జగనన్న గుర్తించడం ఆనందంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతోందన్నారు.

రేషన్ బండిపై ఎందుకీ కక్ష!

- ఒప్పందం ఉన్నంత వరకూ ఎండీయూలను కొనసాగించాలి
- అనాలోచిత నిర్ణయాలతో రోడ్డుపాలు చేయొద్దు
- స్థానిక ఎన్నికల్లో కూటమికి గుణపాఠం తప్పదు
- ధ్వజమెత్తిన ఎండీయూ ఆపరేటర్లు



అనకాపల్లి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎండీయూ ఉద్యోగులు

అనకాపల్లి:

కూటమి ప్రభుత్వ పాలనలో ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, ఇంటింటికీ రేషన్ ఇచ్చే వాహనాలను జూన్ 1వ తేదీ నుంచి నిలిపివేడంతో వేలాది కుటుంబాలు రోడ్డుపడే పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించారని రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు జెట్టి శ్రీను అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ ర్యాలీ నిర్వహించి, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ విజయ కృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, కూటమి పాలనలో ఉన్న ఉద్యోగాలను తొలగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 2021 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు, ఈ బీసీ కార్పొరేషన్ల ద్వారా ఉపాధి లభించిందని, అయితే ఈ ఏడాది మే 20న జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు ప్రకటించి వారి పొట్ట కొట్టారని అన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 జనవరి వరకూ ఇంటింటి రేషన్ కోసం ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. ఎండీయూ వ్యవస్థను నమ్ముకుని 18,500 కుటుంబాలు వారి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ, విజయవాడ వరదలు, తిరుపతి వరదల సమయంలో ఎండీయూ అందించిన సేవలు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయకపోగా, వైఎస్సార్‌సీపీ పాలనలో నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాలను కూడా తొలగించడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. 2027 వరకూ ఎండీయూ వ్యవస్థని కొనసాగించాలి లేదా 20 నెలలకు సంబంధించిన మొత్తం బకాయిలు (నెలకు రూ.18 వేలు) చెల్లించాలన్నారు.

ఈ నిరసనలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణరావు, ఎండీయూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు దారుణం



రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలు మావి. ఎండీయూ వ్యవస్థ ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ ఇంటింటికి అందజేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా వాహనాలను నిలిపివేయడం అన్యాయం. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలకు అధికారం చేపట్టిన తరువాత కూటమి పాలనకు చాలా వ్యత్యాసం కనిపించింది. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇస్తే, కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాలు తొలగించడం అన్యాయం.

–జెట్టి శ్రీను, రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

బడుగువర్గాలకు అన్యాయం



2021లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే, చంద్రబాబు ఎండీయూలను రద్దు చేయడం అన్యాయం.

–బంగారి లక్ష్మణరావు, యూనియన్ జిల్లా కార్యదర్శి, అనకాపల్లి

పునరాలోచన చేయాలి



విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎండీయూలు అందరం అండగా నిలబడి రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు వేతనం రూ.52.45లక్షలు అందజేశాం. ఆ విశ్వాసం లేకుండా ఎండీయూలను విధుల నుంచి తొలగించడం అన్యాయం. రేషన్ డీలర్లు చేసిన మోసాలను దృష్టిలో పెట్టుకుని ఎండీయూ వ్యవస్థను కొనసాగించేలా ప్రభుత్వం ఆలోచించాలి.

– టి.ప్రసాద్, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు

చట్ట పరిధిలో సమస్యలకు పరిష్కారం


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 40 అర్జీలు అందాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల సమస్యలు వింటూ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ తదితర అంశాలపై ఫిర్యాదు వచ్చాయని చెప్పారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



నాకు తల్లిదండ్రులు ఇచ్చిన 3 సెంట్ల భూమి ఉంది. 2012 డిసెంబర్ 28న నా స్థలం పక్కన ఉన్న వ్యక్తి ఆక్రమించాడు. అప్పటి నుంచి నేటి వరకూ ఎస్పీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై మునగపాక పోలీస్‌స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశాను. ఎప్పుడు పరిష్కరిస్తారో అర్థం కావడం లేదు.

– చిట్టిబోయిన కన్నయ్యమ్మ, టి.సిరసపల్లి గ్రామం, మునగపాక మండలం

చోరీ సొత్తు ఇప్పించాలి..



ఈ ఏడాది ఏప్రిల్ 17న ఇంటిలో కుటుంబ సమేతంగా మేడపైన నిద్రపోతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు 8.5 తులాల బంగారం ఆభరణాలు పట్టుకుపోయారు. సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి దొంగలను ఇప్పటికీ పట్టుకోలేదు. అక్కడ పోలీసుల్లో స్పందన లేకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశాం. త్వరితగతిన చోరీ సొత్తు ఇప్పించాలి.

– ఉదత పైడమ్మ, టెక్కలిపాలెం, సబ్బవరం మండలం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు ఎడ్ల సన్యాసినాయుడు

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో పెదపల్లి హైవే కూడలి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని యలమంచిలి పాతవీధికి చెందిన ఎడ్ల సన్యాసినాయుడు(37) దుర్మరణం పొందాడు. పట్టణంలో ఓ ఎలక్ట్రికల్ ఉపకరణాలు విక్రయించే దుకాణంలో సన్యాసినాయుడు రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ఉన్న తన అత్తవారింటికి వెళ్లడానికి పెదపల్లి హైవే కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సన్యాసినాయుడు నడుం భాగం నుంచి కింద శరీర భాగాలన్నీ నుజ్జయ్యాయి. దీంతో ఆయన ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అత్తవారింటికి వెళ్తుండగా ఊహించనిరీతిలో రోడ్డు ప్రమాదం ఇంటి పెద్దను మృత్యువు కబళించడంతో భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది. భార్య కరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.

నిరసనలతో హోరెత్తిన కలెక్టరేట్


కలెక్టర్‌ను కలిసిన ఏపీఐఐసీ నిర్వాసితులు


దొంకాడ దళితులపై దాడి ఘటనపై చర్యలు కోరుతూ నిరసన తెలుపుతున్న దళితులు

తుమ్మపాల: తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ప్రజలు, ప్రజా సంఘాలు చేపట్టిన నిరసనలు, ధర్నాలతో కలెక్టరేట్ హోరెత్తింది. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు నిరసన వ్యక్తం చేశారు. నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి పదేపదే అర్జీలు సమర్పిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటు వాపోయారు. దళిత సంఘాలు, ఎండీయూ వాహనదారులు, గిడ్డంగుల హమాలీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి నియంత్రించారు. కలెక్టరేట్‌లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరి వద్ద ఉన్న సంచులు, వస్తువులను తనిఖీ చేసి లోపలికి పంపించారు. ఒకరిద్దరి వద్ద అనుమానాస్పద వస్తువులు ఉండడంతో వారిని మందలించి, అర్జీతో మాత్రమే పీజీఆర్ఎస్ వేదిక వద్దకు పంపించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ విజయ కృష్ణన్ అర్జీలు స్వీకరించారు. పలువురు మహిళలు ఇంటి స్థలాల మంజూరు కోసం అర్జీ అందజేసేందుకు ఉదయాన్నే వచ్చినా కలెక్టర్ దగ్గరకు వెళ్లకుండా సిబ్బంది అడ్డుకోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

దొంకాడ దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. దళితులపై దాడి జరిగి తొమ్మిది రోజులు అవుతున్నా నేటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. దాడికి గురైన బాధితులు ఇచ్చిన ఫిర్యాదుకు తగ్గట్టుగా ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు నమోదు చేయకుండా దోషులను కాపాడేలా పోలీసులు బెయిలబుల్ సెక్షన్లు వేశారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. తక్షణమే నిష్పక్షపాత విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు రవి సిద్ధార్థ, రాజు బాబు, బి.వెంకటరమణ, ఎం.అప్పలరాజు, చిరంజీవి, లోవరాజు, దొరబాబు, రాము, అప్పారావు, కన్నారావు, శివ, ఆనందరావు, స్వర్ణ రాజు, మురళి, రాజు పాల్గొన్నారు.

వివాహితులకూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో నిర్వాసిత కుటుంబాల్లో వివాహితులకు, మేజర్లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని పలువురు నిర్వాసితులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. చందనాడ, తమ్మయ్యపేట, మూలపర, అమలాపురం తదితర గ్రామాలకు చెందిన నిర్వాసితులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు సూరాకాసుల గోవిందుల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి, అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసేకరణ సమయంలో టీడీపీ ప్రభుత్వం 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని, నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మగ, ఆడవారికి వివాహాలైనా ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారన్నారు. తాజాగా అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో ప్రకటిస్తున్న లబ్ధిదారుల జాబితాల్లో వివాహాలైన మహిళల పేర్లు లేవన్నారు. డీఫారం భూముల్లో ఫల సాయానికి కూడా నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. బుచ్చిరాజుపేటలో కొత్తూరు, చందనాడలో కర్రివారి వీధి, తమ్మయ్యపేటలో తుమ్మలపేట, పాటిమీద, మూలపర, బోయపాడు, డీఎల్‌పురంలో వాడపేటను వేరొక చోటకు తరలిస్తున్నారన్నారు. దీంతో ఇళ్లు, నివాస ప్రాంతాలను కోల్పోతున్న వారికి ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ ప్రకారం ఇంటి స్థలం, రూ.8.30 లక్షలు ఆర్థిక సాయం మాత్రమే అందిస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. ఇది ఏమూలకు సరిపోదన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన స్త్రీ, పురుషులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింజేయాలన్నారు. ఇంటి స్థలంతో పాటు రూ.25 లక్షల ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సాయం అందజేయాలని కోరారు.

స్పీకర్ మైనింగ్ అక్రమాలపై ఫిర్యాదు


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

తుమ్మపాల: స్పీకర్ అయ్యన్నపాత్రుడి మైనింగ్ అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నర్సీపట్టణం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కొత్త సిరిపురం నుంచి మైనింగ్ ప్రదేశానికి రహదారిని అనధికారికంగా నిర్మించి వినియోగిస్తున్నారని గణేష్ ఆరోపించారు. గతంలో పర్యావరణ అనుమతులు లేని కారణంగా ట్రిబ్యునల్ పనులను నిలిపివేసిందని, ఇప్పుడు అదే స్థలంలో మైనింగ్ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయన్నారు. న్యాయవ్యవస్థ ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘించి మైనింగ్ చేపడుతున్నారన్నారు. అనుమతులు లేని అన్ని మైనింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు.

ప్రధానార్చకుడిగా సీతారామాచార్యులుకు పదోన్నతి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు–2గా కరి సీతారామాచార్యులు పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఉప ప్రధానార్చకులుగా ఉన్న ఆయన పురోహిత్ అలంకారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. స్వామి ఆర్జిత సేవలు, నిత్య సేవలు, ప్రముఖ ఉత్సవాల రోజుల్లో వైదికపరంగా సీతారామాచార్యులు సేవలు కీలకం. స్వామివారి ఉత్సవమూర్తుల వస్త్రాలంకరణలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. ఆయన ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందడంతో ఖాళీ అయిన ఉప ప్రధానార్చకుడి పోస్టును త్వరలో భర్తీచేయనున్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సత్వర చర్యలు

- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) జిల్లా స్థాయి సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకగవాక్ష విధానం కింద గత ఏప్రిల్ 15న జరిగిన సమావేశం నుంచి ఇప్పటివరకు 299 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 239 ఆమోదించామని చెప్పారు. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకు 176 పరిశ్రమల్లో అధికారులు తనిఖీ చేశారని, పలుచోట్ల పనితీరు మెరుగుదలకు సూచనలను ఇచ్చారని చెప్పారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, ఏపీఐఐసీ డీజీఎం రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు, జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విమ్స్‌లో 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ

28 వైద్య పోస్టుల భర్తీ

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్య పోస్టుల భర్తీ కోసం ఈ నెల 29న వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి రాత పరీక్ష ఉండదు. కేవలం అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేస్తారు. ప్రస్తుతం విమ్స్‌లో వివిధ విభాగాల్లో 28 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి విమ్స్‌లో జరిగే వాక్-ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని డైరెక్టర్ రాంబాబు కోరారు. ఉత్తీర్ణత పత్రాలు, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలి. స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.1.60 లక్షలు వేతనంగా చెల్లిస్తారు. అనస్థీషియా విభాగంలో 10 ఉద్యోగాలు, న్యూరో సర్జరీలో 3, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్) 3, కార్డియాలజీలో 2, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 2, జనరల్ మెడిసిన్‌లో 2 పోస్టులతో పాటు సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ, పల్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాల్లో ఒక్కొక్క పోస్టు భర్తీ చేస్తున్నారు. మరిన్ని వివరాల కోసం http://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

సింహాచలం ఈవోగా విధుల్లో చేరిన త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావు సోమవారం తిరిగి విధుల్లో చేరారు. ఈ ఏడాది మార్చి నుంచి త్రినాథరావు వ్యక్తిగత కారణాలతో 92 రోజులు సెలవు పెట్టిన విషయం తెలిసిందే. నెలాఖరుతో సెలవు గడువు ముగియనుండటంతో తిరిగి విధుల్లో చేరారు. ఇప్పటివరకు దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తించిన దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ఆయనకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం త్రినాథరావు మాట్లాడుతూ వచ్చే నెల 8న సింహగిరిపై జరిగే శ్రీ నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌లు త్రిమూర్తులు, జీవీవీఎస్‌కే ప్రసాద్, కంచి మూర్తి, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

గుడివాడలో అక్రమ తవ్వకాలపై ఆకస్మిక తనిఖీ


డ్రిల్లింగ్ మిషన్ సీజ్ చేస్తున్న మైనింగ్ అధికారులు

రావికమతం: మండలంలో గుడివాడ పంచాయతీలోని కొండపై అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు సోమవారం భూగర్భ గనుల శాఖ ఏడీ జి.శివాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుడివాడ పంచాయతీ సర్వే నంబర్ 399లో ఉన్న కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలకు ఉపయోగించే డ్రిల్లింగ్ మిషన్, డీజిల్ ఆయిల్‌తో ఉన్న డ్రమ్మును సీజ్ చేశారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ 4.95 ఎకరాల విస్తీర్ణంలో బ్లాక్ మెటల్ తవ్వకాలకు నెట్ కం ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వేలంలో రూ.16.20 లక్షలు చెల్లించి అనుమతి కోరిందన్నారు. దీనికి సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలు, అగ్రిమెంట్ ఇంత వరకు సమర్పించకపోవడంతో అనుమతులు ఇవ్వలేదన్నారు. ఘటనా స్థలంలో యజమానులు ఎవరూ లేకపోవడంతో మిషన్లు మాత్రమే స్వాధీనం చేసుకున్నామని ఏడీ చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల హెచ్‌డీ టి.అప్పలనాయుడు, వీఆర్వో నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.


త్వరితగతిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 11ను పురస్కరించుకుని యోగాను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మండలాల్లో, గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో యోగాభ్యాస కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో 7 నియోజకవర్గ పర్యాటక ప్రాంతాలలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం బీచ్ పర్యాటక ప్రాంతం వద్ద ఉదయం 7 గంటలకు యోగాంధ్ర కార్యక్రమన్ని ప్రారంభించనున్నామన్నారు.

– యోగా గురువులు, యోగా శిక్షకులు, వలంటీర్లు, యోగా అభ్యాసకులు, సాధారణ ప్రజలు తమ పేర్లను https:// yogandhra. ap. gov. in/#/ home/ yoga& registration వైబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.లావణ్య, జిల్లా ఆయుష్ అధికారి, ఎంపీడీవోలు, నియోజకవర్గ మండల స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంత జీవితం


యోగాసనాలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలంటే నిత్యం యోగా చేయడం అవసరమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, అంతర్జాతీయ యోగా వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న 'యోగాంధ్ర–2025'కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లా ఆయుష్ విభాగం అధికారి కె.లావణ్య, యోగా గురువులు శ్రీను, చంద్రిక, శివ, సతీష్, జగన్ తదితరుల మార్గదర్శనంలో అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు బి.మోహనరావు, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, సీఐలు టి.వి.విజయ కుమర్, లక్ష్మణ్ మూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, టి.లక్ష్మి, గఫ్ఫార్, రమేష్, రామకృష్ణ, మన్మథరావు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి ఊతం

- ఉన్నత్ భారత్ అభియాన్‌లో భాగంగా సత్ఫలితాలు
- శ్రామికులు, రైతులకు సాంకేతికతను అందించడంలో విద్యార్థుల ప్రతిభ
- 5 గ్రామాలను దత్తత తీసుకున్న ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల



తంతడిలో కుమ్మరుల పనితీరుపై అధ్యయనం చేస్తున్న ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అచ్యుతాపురం: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఉన్నత్ భారత్ అభియాన్ ఒకటి. ఇది గ్రామీణ భారతదేశం అభివృద్ధిలో ఉన్నత విద్యా సంస్థలను భాగస్వామ్యం చేస్తుంది. సాంకేతిక పరంగా వెనకబడిన శ్రామికులు, కార్మికులు, చేతి వృత్తుల వారికి చేదోడుగా నిలిచే ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రోత్సాహకాలను ఇస్తుంది. దీంతో వనరుల్ని సద్వినియోగం చేసుకోవడం, ఆర్థిక క్రమశిక్షణ, పురోభివృద్ధికి అవసరమైన సాంకేతికను అందించడంలో విద్యార్థులు మేము సైతం అంటూ ప్రతిభ కనబరుస్తున్నారు. ఉన్నత భారత్ అభియాన్‌లో భాగంగా ఐఐటీ ఢిల్లీతో పాటు, అచ్యుతాపురంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆరు ప్రాజెక్టులకు రూ.6 లక్షల ప్రోత్సాహకం అందుకుంది. దీనిలో భాగమైన విద్యార్థుల ప్రతిభా పాటవాలు పెరగడంతో పాటు, గ్రామీణ జీవనానికి చేదోడు వాదోడుగా నిలిచే అవకాశం దక్కుతుంది.

ఐదు గ్రామాల దత్తత

ప్రతి ఉన్నత విద్యా సంస్థ కనీసం ఐదు గ్రామాల్ని దత్తత తీసుకోవాల్సి ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న చేతి వృత్తులు, వృత్తిలో సాంకేతికను జోడించే విధంగా విద్యా సంస్థలు కృషి చేయాలి. ఈ క్రమంలోనే అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తంతడి, దోసూరు, దొప్పెర్ల, ఎర్రవరం, ఉప్పవరం గ్రామాల్ని ఎంపిక చేసుకున్నారు. తంతడి గ్రామంలో కుమ్మరులు మట్టి పాత్రలు తయారు చేసే విషయంలో కాలుష్య రహితంగా కుండల్ని కాల్చే పరిజ్ఞానాన్ని కళాశాల విద్యార్థులు అందించారు. సెంట్రల్ గ్లాస్, సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కోల్‌కతా, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఒప్పందంతో కుమ్మరులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. దీనికి తోడు నిమ్మగడ్డి నుంచి సుగంధ నూనె, యూకలిప్టస్ సైట్రియో డొరా సుగంధ నూనె, పర్యావరణ రహిత కొబ్బరి చిప్పల బొమ్మలు, వ్యక్తిగత పరిశుభ్రత, 3 డీ ప్రింటింగ్ వస్తువులతో బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ పెంచుట వంటి అంశాలపై ప్రాజెక్టులు రూపొందించారు. ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక బహుమతి పొందారు. దీనికి తోడు వందలాది మంది శ్రామికులు, రైతులకు దోహదపడే అంశాలపై అవగాహన కల్పించారు. తద్వారా గ్రామీణ జీవనంలో సుస్థిర అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు.

ఉత్తమ నాటికగా 'జనరల్ బోగీలు'

ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు


నాటిక పోటీలో ఉత్తమ నటునిగా శేఖర్‌కు బహుమతి, జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

కశింకోట: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలో గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఇదే నాటికకు అత్యధికంగా పలు విభాగాల్లో నాలుగు బహుమతులు లభించాయి. స్థానిక గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా పది నాటికలను ప్రదర్శించారు. పోటీలో 9 నాటికలను పరిగణనలోకి తీసుకున్నారు. వీటిలో ఉత్తమ ద్వితీయ, తృతీయ ప్రదర్శనలు వరుసగా విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి 'నిశ్శబ్దమా? నీ ఖరీదెంత?', గుడివాడకు చెందిన కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వార బంధాల చంద్రయ్యనాయుడు', స్పెషల్ జ్యూరీ ప్రదర్శన ప్రథమ, ద్వితీయంగా గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేను వచ్చేస్తా', హైదరాబాద్ గోవాడ ఆర్ట్స్ వారి 'మూల్యం' బహుమతులు గెలుచుకున్నాయి. ఉత్తమ నటునిగా పెందుర్తి డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిల జీవి' నాటికలో అయ్య పాత్రధారి బీసీహెచ్ శేఖర్, ద్వితీయ ఉత్తమ నటునిగా హైదరాబాద్ గోవాడ ఆర్ట్స్ వారి 'మూల్యం' నాటికలో సోమ సుందర్ పాత్రధారి భాగి శివశంకర్‌శాస్త్రి, ఉత్తమ నటిగా గుంటూరు జిల్లా కొలకలూరు సాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు'లో సావిత్రమ్మ పాత్రధారి సురభి ప్రభావతి, ద్వితీయ ఉత్తమ నటిగా గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికలో సావిత్రి పాత్రధారి ఎస్. అమృత వర్షిని, ఉత్తమ ప్రతి నాయకునిగా 'జనరల్ బోగీలు' నాటికలో సీఐ పాత్రధారి, సినీ,రంగస్థల నటుడు గోపరాజు విజయ్, ఉత్తమ దర్శకునిగా విశాఖపట్నం తెలుగు కళా సమితి వారి 'నిశ్శబ్దమా? నీ ఖరీదెంత? నాటిక దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్, ఉత్తమ సహాయ నటునిగా విజయవాడ గురజాడ కళామందిర్ వారి ' మహా ప్రస్థానం'లో సింహాద్రి పాత్రధారి బి. నరేస్, ఉత్తమ సహాయ నటిగా కాకినాడ బీవీకే క్రియేషన్స్ వారి 'తితిక్ష' నాటికలో భారతి పాత్రధారి ఎస్. జ్యోతిరాణి, ఉత్తమ హాస్య నటుడు 'నిశ్శబ్దమా? నీ ఖరీదెంతలో వామనరావు పాత్రధారి డి. కన్నబాబు, ఉత్తమ క్యారెక్టర్ నటునిగా 'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటికలో చంద్రయ్యనాయుడు పాత్రధారి సీఆర్‌వీఏ నరసింహారావు బహుమతులను గెలుచుకున్నారు. ఉత్తమ రచనగా జనరల్ బోగీలు నాటిక రచయిత పీటీ మాధవ్, ఉత్తమ సంగీతంగా 'చీకటి పువ్వు' నాటికకు అందించిన సురభి నాగరాజుకు, ఉత్తమ రంగాలంకరణ 'తితిక్ష' నాటికలో సురభి సంతోష్‌కు, ఉత్తమ ఆహార్యం (మేకప్ మెన్)గా 'ద్వారబంధాలు చంద్రయ్యనాయుడు'లో పి. శేషగిరి, పి.వి. సత్యనారాయణ, జ్యూరీ అవార్డులుగా 'చీకటిపువ్వు' నాటికలో వాటికల్ సిద్ధార్థ పాత్రధారి ఎస్. సూర్య, 'నాన్నా నేనొచ్చేస్తా'లో శ్రీరాం పాత్రధారి ఎస్‌కె.డి. హసన్‌కు లభించాయి. బహుమతులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, తదితరులు అందజేశారు. సూరిశెట్టి రాము, భీమిశెట్టి వేణుగోపాలకృష్ణ, పొన్నాడ ముత్యాలరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేయించారు. ఆరోగ్యంగా ఉండటానికి యోగాసనాలు దోహదపడతాయని గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ వరకు జరిగే తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

కశింకోట: మండలంలో తేగాడ రైతు సేవా కేంద్రం వద్ద ప్రభుత్వ రాయితీపై సమీకృత మిశ్రమ దాణా సోమవారం రైతులకు పంపిణీ చేశారు. వేసవిలో పశు గ్రాసం కొరత నివారించేందుగాను దీన్ని అందజేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి ఆల్ఫ్రాన్సా జార్జి తెలిపారు. 50 కిలోల దాణా బస్తా రూ.1,110 కాగా రాయితీపోనూ రూ.555కు పంపిణీ చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కర్రి సత్యనారాయణ, సిదిరెడ్డి సూర్యనారాయణ, వేగి రామకోటేశ్వరరావు, అద్దెపల్లి బాబూరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వట సావిత్రి వ్రతం



ఆలయంలో వట సావిత్రి వ్రతం చేస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వైశాఖ మాస బహుళ అమావాస్య సందర్భంగా సోమవారం ఆలయ మండపంలో సామూహిక వట సావిత్రి వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

పరవాడ: స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంగళవారం ముత్యాలమ్మపాలెం గ్రామాన్ని సందర్శిస్తారని కూటమి నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ముత్యాలమ్మపాలెం గ్రామంలో యోగా అవగాహన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 266 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,170	4,800
రెండో రకం	4,100	4,300
మూడో రకం	3,200	3,750

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏసీఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -11, ఓ పాజిటివ్ -11, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ 9703619706ను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 264 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నెంబరును సంప్రదించవచ్చు.



కూలిపోయే స్థితిలో తహసీల్దార్ కార్యాలయం

- బ్రిటిష్ హయాంలో నిర్మాణం
- వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు
- తడిసిపోతున్న రికార్డులు
- కూలేందుకు సిద్ధంగా పురాతన భవనం
- దుస్థితిలో అనకాపల్లి తహసీల్దారు కార్యాలయం

నా మొర వినేదెవరు?

దశాబ్దాల చరిత్ర నాది... బ్రిటిష్ కాలంలో ఈ భూమ్మీద పుట్టా.. అప్పటి నుంచి ఇప్పటికీ పురిటిగడ్డపై సేవలందిస్తున్నా.. నా పంచన చేరిన ఎంతోమంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ.. బదిలీలతోపాటు రిటైర్డ్ అయి వెళ్లిపోతున్నారు. ఎంతోమంది ప్రజా ప్రతినిధులు ఎన్నోసార్లు సందర్శించారు. రోజు రోజుకీ పటుత్వం కోల్పోయి ఇప్పుడు బూత్ బంగ్లాను తలపిస్తున్నాను. అయినా నన్ను పట్టించుకున్న నాథుడే లేకపోయాడు. ఎప్పుడైనా చిన్నపాటి వర్షం కురిస్తే, నాలో ఎక్కడా లేని అలజడి.. నాకు కొప్పుగా అమర్చిన పెంకులు నుంచి వర్షపునీరు కారుతుంటే మొత్తంగా తడిచిపోతున్నాను. మెయిన్‌రోడ్డుకు ఐదడుగుల దిగువకు ఉండటం వల్ల వర్షపు నీటిలో మునిగిపోతున్నాను. ఆ నీటిలో నా అశ్రుధారలు కలిసి ఇంకిపోతుంటే ఇక నా మొర వినేదెవరు. రాతి కవచంలాంటి నా దేహం(గోడలు) చూసి మర్రి ఊడలకు అసూయ పుట్టిందేమో.. నా ఒళ్లంతా అల్లుకుని తనలో మరింతగా బంధించుకుని నన్ను బలహీనపరుస్తున్నాయి. దాంతో పగుళ్లిచ్చి పెచ్చులుగా ఊడిపడుతున్నా.. నా నీడన తలదాచుకుంటున్న ఉద్యోగులు భయం భయంగా పని చేస్తున్నారు. అక్కడికి వివిధ పనులపై వస్తున్న ప్రజలు నా వైపు జాలిగా చూస్తుంటే.. నా మనసును గెలికినట్టుగా ఉంటుంది. వారు అలా చూడటం నాకు నచ్చడం లేదు. ఎందుకంటే నాది దశాబ్దాల చరిత్ర... ఒకప్పుడు దర్పం ఒలకబోస్తూ.. అనకాపల్లి ప్రాంతానికే వైభవం తెచ్చాను. ఇప్పుడు సత్తువ కోల్పోయా... అంతమాత్రాన నా చరిత్ర వక్రీకరించలేనిది. పాడైన ఫర్నిచర్, విరిగిపోయిన కుర్చీలు, దుమ్ము, ధూళి, చెదలు పట్టిన రికార్డు గదిలోకి సిబ్బంది రావడానికి సాహసించడం లేదు. ప్రజలు వివిధ పనులపై పెట్టుకున్న అర్జీలు, విలువైన డాక్యుమెంట్లకు భద్రత ఉండటం లేదు. వాటిని ఒక బెంచిపై, పాత ఇనుప బీరువాలపై ఉంచడం చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. సాలీడులా వేలాడుతున్న విద్యుత్తు తీగలు.. కిర్రుకిర్రుమంటూ కీచు శబ్దం చేస్తున్న పురాతన ఫ్యాన్లు రోత పుట్టిస్తున్నాయి. ఇన్ని సమస్యలతో నలిగిపోతున్న నేను ఇక ఎక్కువ కాలం మనుగడ సాగించలేను. పూర్తిగా శిథిలమైపోయిన నేను ఏదో ఒక రోజు నేల కూలే స్థితిలో ఉన్నాను. ఇప్పటికైనా పాలకులు ఒక సారి నా దీనస్థితిని చూసి నన్ను నేలమట్టం చేసి.. ఉద్యోగులకు కొత్తగా భవన వసతి కల్పించాలని మనవి చేసుకుంటున్నాను.

ఇట్లు
తహసీల్దారు కార్యాలయం
అనకాపల్లి

– అనకాపల్లి టౌన్



అస్తవ్యస్తంగా కరెంట్ వైర్లు

వర్షం కురిస్తే కార్యాలయానికి ముంపు..



ప్రజల అవసరాలు తీర్చే తహసీల్దార్ కార్యాలయం వర్షం కురిసిన ప్రతీ సారి నీటి ముంపునకు గురవుతోంది. దాంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా భవనం నిర్మించాలి

– ఆర్. రాంబాబు, రేబాక

కార్యాలయాన్ని తరలించాలి



మేము దరఖాస్తు చేసుకున్న రికార్డులు సక్రమంగా ఉంటాయో లేదో అని భయమేస్తోంది. కార్యాలయంలో వైర్లు వేలాడుతున్నాయి. తక్షణమే కార్యాలయాన్ని వేరో చోటకు తరలించాలి.

– పి. ప్రసాద్, అనకాపల్లి



కార్యాలయం లోపల గోడలకు పాకిన చెట్టు ఊడలు



బెంచీలపై ఉంచిన విలువైన రికార్డులు

అక్రమ క్వారీలపై చర్య తీసుకోండి..



విజిలెన్స్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న జనసేన సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు

చోడవరం: నియోజకవర్గంలో అక్రమ క్వారీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కింజరపు ప్రభాకర్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని జనసేన చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు చెప్పారు. రోలుగుంట మండలంలో రాయి క్వారీలు, చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో అక్రమ ఇసుక, గ్రావెల్ క్వారీలు నిర్వహించి సహజ సంపదను కొందరు లూటీ చేస్తున్నారని రాజు ఆరోపించారు. ఈ అక్రమ క్వారీలపై వెంటనే దాడులు చేసి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. శీమునాపల్లి, జుత్తాడ, రాయపురాజుపేట, గజపతినగరం, జుత్తాడ, గవరవరం, వెంకన్నపాలెం, అంబేరుపురం, భోగాపురం, లక్కవరం ప్రాంతాల్లో ఎక్కువగా నదుల్లో అక్రమ ఇసుక క్వారీలు, కొండపై మెటల్ క్వారీలు నిర్వహిస్తున్నట్టు తమ పరిశీలనలో తేలడంతో ఎస్పీకి అన్ని వివరాలతో ఫిర్యాదు చేశామని చెప్పారు.

ఖరీఫ్ కల్లా తాండవ కాలువ పూడికతీత



పూడికతీత పనులపై వివరాలు తెలుపుతున్న ఏపీవో కొండాజీ

నాతవరం : ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసే సమయానికి తాండవ కాలువలో పూడికతీత పనులు పూర్తి చేస్తామని ఉపాధి హామీ పథకం ఏపీవో దాసరి కొండాజీ అన్నారు. మండల కేంద్రంలో గల ఇరిగేషన్ కార్యాలయంలో తాండవ ఆయకట్టు నీటి సంఘాలు అధ్యక్షులు ప్రాజెక్టు అధికారులతో సోమవారం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై నీటి సంఘాల అధ్యక్షులు అధికారులతో చైర్మన్ చర్చించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో కాలువలో ఇంతవరకు తీసిన పూడికతీత పనుల వివరాలను ఉపాధి హామీ పథకం ఏపీవో కొండాజీ తెలిపారు. మిగతా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు తాండవ ప్రాజెక్టు దిగువనున్న ఖాళీ ప్రదేశంలో ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ జేఈ శ్యామ్‌కుమార్ నీటి సంఘాల అధ్యక్షుడు, రైతులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతరకు జోరుగా ఏర్పాట్లు



వెండి కవచంతో పాటు పాటు బంగారు ఆభరణాలతో మోదకొండమ్మను అలంకరిస్తున్న దృశ్యం

మాడుగుల : వచ్చే నెల 3న మాడుగుల మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా భారీ స్థాయిలో విద్యుత్ లైటింగ్‌కు, భారీ నేలవేషాలకు సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సతకం పట్టు స్టేజీపై ఈ నెల 30వ తేదీన క్లాసికల్ డ్యాన్స్‌తో పాటు కోలాటాలు, ఈనెల 31న జానకీరామ్ తిరుపతి బృందంతో రేలా రేరేలా, జూన్1వ తేదీన హైదరాబాద్ వారి డ్యాన్స్ మస్తీడ్యాన్స్, 2వ తేదీన హైదరాబాద్‌వారి డ్యాన్స్ ఉత్సవ్, పండగ రోజు, 3వ తేదీన చింతామణి గయోపాఖ్యానం నాటకంతో పాటు చిత్ర విచిత్రమైన నేలవేషాలు, పలు డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆలయానికి రంగులు అద్ది ఆకర్షణీయంగా తయారు చేశారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



చెర్రీస్ అలంకరణతో పోతురాజు నూకాంబిక

అనకాపల్లి: అమావాస్య సందర్భంగా సోమవారం స్థానిక గవరపాలెం అరుంధతి నగర్‌లో స్వయంభూ పోతురాజు నూకాంబిక దేవస్థానంలో అమ్మవారికి చెర్రీస్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటం ఊరేగింపు కార్యక్రమం పురవీధుల్లో ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి పెట్ల నాగేశ్వరరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి విద్యార్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



చౌదరి గీత

అనకాపల్లి: పట్టణంలోని సాయి కుల్వంత్ కళాశాల విద్యార్థిని చౌదరి గీత బీబీఏ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 24న ఏయూ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో తమ విద్యార్థిని జిల్లా స్థాయి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ ఎం.కామరాజు సోమవారం ఒక ప్రకటనలో ఆమెను అభినందించారు. రెండేళ్లుగా బీబీఏలో తమ కళాశాల విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందజేశారు.

అదృశ్యమైన తల్లీ కుమార్తె ఆచూకీ లభ్యం

మునగపాక: ఒంపోలులో అదృశ్యమైన వివాహిత లలిత, ఆమె కుమార్తె ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన దాసరి సన్యాసినాయుడు, లలిత దంపతుల మధ్య ఇటీవల గొడవ జరగడంతో లలిత తన చెల్లి ఇంటికి వెళ్లిపోయింది. విషయం తెలియక సన్యాసినాయుడు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. రెండేళ్ల పాప రియాన్సీతో కలిసి లలిత తన చెల్లి ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించారు. మహిళా కానిస్టేబుల్ దేవి.. లలితను తీసుకువచ్చి అప్పగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒక చోట కలిసిన పూర్వ విద్యార్థులు



రిటైర్డు హెచ్ఎం వైద్యనాథంకు సత్కారం

కశింకోట: మండలంలోని బయ్యవరం జెడ్పీ హైస్కూలులో రెండు దశాబ్దాల క్రితం టెన్త్ చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కలిసి ఒకరికొకరు పలకరించుకుని, వారి యోగ క్షేమాలు తెలుసుకొని ఆనందపరవశులయ్యారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. రిటైర్డు హెచ్ఎం వైద్యనాథంతోపాటు ఉపాధ్యాయులు ఆనందరావు, కృష్ణారావు, నాగకుమారి, నాగలక్ష్మి, కేశవరావు, పార్వతీదేవి, చల్లారావు, జోగినాయుడు తదితరులను దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి గురుభక్తి చాటుకున్నారు. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూర్వ విద్యార్థులు ఆర్. సీతాపతి, ఎ. మధుబాబు, కె. హరి, కె. వేంకన్న, సిహెచ్. శ్రీను, జి. సత్తిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



నరసింగబిల్లి హైస్కూలు పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి జెడ్పీ హైస్కూలులో 2007-08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు షేక్విళ్లపాలెం తలుపులమ్మ గుడి వద్ద సోమవారం కలుసుకుని సందడి చేశారు. పరస్పరం పలకరించుకొని పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఏటా అంతా కలవాలని నిర్ణయించుకున్నారు. అంతా కలిసి ఫొటో దిగారు. మధ్యాహ్నం సామూహిక భోజనాలు చేశారు. అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

శిథిలమైన పెంకుటిల్లుతో ప్రాణహాని

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

అనకాపల్లి: పట్టణంలో వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద 1950లో నిర్మించిన పెంకుటిల్లు శిథిలావస్థకు చేరుకుందని, దీనిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అదే ప్రాంతానికి చెందిన చెల్లపల్లి శ్రీనివాసరావు సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జోనల్ పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న పెంకుటిళ్లు ఇప్పటికే తొలగించారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు శిథిలమైన పెంకుటిల్లు తడిచి ముద్దయిందని, ఈ ఇంట్లో నివసిస్తున్న వారికి ప్రాణహాని జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎన్టీపీసీ బూడిద లారీలతో అనారోగ్యం



దేశపాత్రునిపాలెం కూడలిలో ధూళి మధ్యే ప్రయాణికుల రాకపోకలు

పరవాడ: ఎన్టీపీసీ కారిడార్ అనుసంధాన రహదారి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలతో ఎగసిపడుతున్న దుమ్మూధూళి కారణంగా సమీప గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలతో బూడిదను తరలిస్తున్నారు. ఇవి ఎన్టీపీసీ నుంచి లంకెలపాలెం ఏలేరు వంతెన మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి రాకపోకల సమయంలో విపరీతంగా ఎగసిపడుతున్న ధూళితో దేశపాత్రునిపాలెం, రాంకీ కూడళ్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు, కార్మికులు, వివిధ ప్రాంతాల నుంచి గాజువాక, స్టీల్ ప్లాంటు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ధూళిని పీల్చడం వలన గొంతు, ముక్కు సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. బూడిద లారీల ద్వారా ఎగసిపడుతున్న ధూళిని అరికట్టేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలకు ఆర్థిక భరోసాను పొందాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ సహకారంతో 90 రోజుల పాటు మహిళలకు ఈ ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కుట్టు మిషన్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ అవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో అమృతపురం రైతులు పండించిన కూరగాయల స్టాల్‌ను సందర్శించి, కూరగాయలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీలక్ష్మీరాణి, ఎంపీడీవో పద్మజ, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, కర్రి అప్పారావు, పార్టీ నాయకులు ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర



మాడుగులలో భగవాన్ సత్యసాయి రథయాత్ర



దేవరాపల్లిలో సత్యసాయి రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

మాడుగుల : భగవన్ సత్యసాయి 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం రథయాత్ర నిర్వహించారు. పురవీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు భజనలు చేస్తూ రథయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూరు అప్పలనాయుడు, లోవరాజు, రవిశంకర్, కె. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.బలరామ్, కె. రాజుకొండ పాల్గొన్నారు.

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి ప్రేమ రథయాత్ర సోమవారం సాయంత్రం చేరుకుంది. మహేశ్వరీ థియేటర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా స్థానిక సత్యసాయి ధ్యాన మందిరానికి చేరుకున్న సత్యసాయి రథయాత్రకు భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. స్థానిక ధ్యాన మందిరంలో పూజా కార్యక్రమాలు అనంతరం కె.కోటపాడు బయలుదేరింది. బాబా నామ స్మరణంతో దేవరాపల్లి మారుమోగింది. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కళిరెడ్డి అప్పలనాయుడు, రమామణి పాల్గొన్నారు.